క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం

పటాన్‌చెరు: వాలీబాల్‌లో విజేతలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం రాత్రి ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించాలని నిర్వాహకులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, పాల్గొన్నారు.

పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి


వ్యాధి నివారణ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

రాయికోడ్(అందోల్): పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకకుండా ఉండేందుకు పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలని పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి పశువుల కాపరులకు సూచించారు. రాయికోడ్‌లో సోమవారం దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ వ్యాధి పశువుల ప్రాణాలకే ప్రమాదమన్నారు. 4 నుంచి 8 నెలల ఆడ దూడలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కేధారినాథ్ పాటిల్, పశువైద్య సిబ్బంది కృష్ణ, అమ్జద్, తదితరులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్ ఉపేందర్

పటాన్‌చెరు టౌన్: ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటారు. ఆదివారం కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన ఏషియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్ని మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సోమవారం ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం, సర్పంచ్ ఉపేందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు అభినందించారు.

చిట్కుల్ నుంచి శ్రీశైలానికి పాదయాత్ర


పాదయాత్రగా బయలుదేరిన శివస్వాములు

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్ నుంచి శ్రీశైలానికి శివస్వాములు పాదయాత్రగా సోమవారం బయలుదేరారు. శివాలయంలో గురుస్వామి శివకుమార్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్రగా శివస్వాములు శ్రీశైలానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు నవీన్, జీవన్ రెడ్డి, వంశీ, విష్ణు, శ్రీశైలం, సందీప్ గౌడ్, దశరథ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

పండరీపూర్ ఆశ్రమంలో పూజలు


పూజలు చేస్తున్న సంజీవరెడ్డి తదితరులు

నారాయణఖేడ్: కల్హేర్ మండలం అంతర్‌గాం ఆశ్రమ పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహారాజ్ మహారాష్ట్రలోని పండరీపూర్ పుణ్యక్షేత్రంలో నూతనంగా నిర్మించిన ఆశ్రమంలో సోమవారం హోమం, పూజలు నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు వెంకట్‌సాగర్, అంజిరెడ్డి, లక్ష్మణ్, రాజు, ఏసురెడ్డి, అశోక్‌రావు, జైపాల్‌రెడ్డి, ఆకాశ్, నర్సింహులు, పండరినాథ్ తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు

రాయికోడ్(అందోల్): కర్చల్ గ్రామంలో నిర్వహించిన కుస్తీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మల్లయోధులు కుస్తీలో గెలిచేందుకు ప్రతిభను కనబర్చి కుస్తీ పట్టారు. ఈ పోటీలకు ఎస్సై ఏడుకొండలు బందోబస్తు ఏర్పాటు చేశారు. విజేతలకు వెండికడియాలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున్, మైపాల్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్, హన్మంతు, ఎంపీటీసీ కృష్ణ, నాయకులు అడివయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

చీడ పీడల నివారణతో దిగుబడి

- జిల్లాలో 13,500 ఎకరాల్లో శనగ పంట సాగు
- సకాలంలో కలుపు తీస్తే ప్రయోజనం


మక్తకాసారం, గార్లపల్లిలో సాగులో ఉన్న శనగ పంట

మునిపల్లి(అందోల్): రబీలో శనగ పంటను రైతులు అధికంగా సాగు చేస్తారు. పంట రక్షణకు సకాలంలో చర్యలు చేపట్టకపోతే శనగ పచ్చ పురుగులు, వేరు ఎండు తెగులు పంటకు సోకుతాయి. దీని వల్ల దిగుబడులు తగ్గిపోతాయి. ఇదే సమయంలో పంటలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వ్యవసాయాధికారులు వివరిస్తారని జిల్లా వ్యవసాయధికారి చెబుతున్నారు.

ఎండు తెగులు నివారణకు..

నేలలో ఉండే ఈ శిలీంధ్రం అన్ని దశల్లో ఆశించి నష్టం కలిగిస్తుంది. ముఖ్యంగా కాయ దశలో ఎక్కువగా సోకుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాములు కాఫర్ ఆక్సీక్లోరైడ్, లేదా ప్రొకోనాజోల్ 2.5 మిల్లీ లీటర్లు చొప్పున కలిపి పిచికారి చేయాలి.

శనగ పచ్చ పురుగు నివారణకు..

ఇవి మొక్కల లేత భాగాన్ని తింటాయి. దీంతో మొక్క ఎదుగుదల ఆగిపోతుంది. దీని నివారణకు లీటరు నీటికి క్లోరిఫైరిఫాస్ 2 మిల్లీ లీటర్లు కలిపి పిచికారి చేయాలి. పంట పూత దశలో నీటి ఎద్దడికి గురి కాకుండా చూడాలి. కలుపును సకాలంలో తీస్తే అధిక దిగుబడులు సాధించొచ్చు.

జిల్లాలో మొత్తం 3 లక్షల 12 వేల హేక్టార్లుండగా సుమారు 2లక్షల 24 వేల హేక్టార్లలో భూమి సాగులో ఉంది. అంతే కాకుండా వివిధ రకాల పంటలను రైతులు సాగుచేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లాలో శనగ పంట 13,500 ఎకరాలు సాగవుతున్నట్టు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

అవగాహన కల్పిస్తున్నాం



పంటలో చీడపీడల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను గ్రామాల్లో వ్యవసాయాధికారుల చేత రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సస్యరక్షణలో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయాధికారులను సంప్రదిస్తే రైతుల పొలం వద్దకు వచ్చి పంటలను పరిశీలించి పలు సూచనలు చేస్తారు.

– నర్సింగ్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

దేవాలయ నిర్మాణానికి విరాళం


నీలం మధును సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని బీరప్ప దేవాలయ నిర్మాణానికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు రూ.2లక్షల విరాళాన్ని సోమవారం అందజేశారు. అనంతరం దేవాలయ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని నీలం మధు తెలిపారు. అనంతరం ఆయన్ను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీరప్ప, శ్రీకాంత్‌యాదవ్, యాదగిరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి:

గుమ్మడిదల గ్రామంలో ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి భక్తులు విరాళాలు అందించారు. హనుమంతరావు రూ.10వేలు, భాస్కర్‌ముదిరాజ్ రూ.21వేలు, మహేశ్‌రెడ్డి రూ.10వేలు, తుర్కపల్లి నర్సింహ్మారెడ్డి రూ.10వేలు నిర్వాహకులకు అందించారు. దేవాలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ నర్సింహ్మారెడ్డి కోరారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి


జోగిపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రవి

జోగిపేట(అందోల్): అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి సరిపోయే విధంగా 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జోగిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 5 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయని, సమావేశాల్లో విద్యారంగానికి నిధులు కెటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేశ్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల మహేశ్‌లు పాల్గొన్నారు.

'అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి'


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: పాటీ–ఘణపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని విశ్వహిందు పరిషత్ ధర్మప్రసార రాష్ట్ర కో–కన్వీనర్ సుభాష్ చందర్, బీజేవైఎం రాష్ట్ర నాయకులు ఆశిష్‌గౌడ్‌లు అన్నారు. సోమవారం పాటీ గ్రామ సమీపంలో ప్రభుత్వ స్థలంలో జరుగుతున్న నిర్మాణాలను వారు సందర్శించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో బీజేవైఎం, బజరంగ్‌దళ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

గొర్రెల కాపరులకు పరిహారం అందజేత


చెక్కు అందజేస్తున్న వసంత కుమారి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): వ్యర్థ జలాలు తాగి మృత్యువాత పడిన జీవాలకు పరిశ్రమ యాజమాన్యం సోమవారం రూ. 6లక్షల పరిహారం అందజేసింది. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంత కుమారి మత్యువాత, అనారోగ్యం బారిన పడిన జీవాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. జీవాల ఆరోగ్య రక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, నాగేష్, సంగమేశ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి


వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ, ఎస్సైలు

ఝరాసంగం(జహీరాబాద్): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్ పేర్కొన్నారు. సోమవారం ఝరాసంగంలో ఎస్సై రాజేందర్‌రెడ్డి, హద్నూర్ ఎస్సై వినయ్‌కుమార్, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.

'బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి'

కొండాపూర్(సంగారెడ్డి): బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ యాజామాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డిలో పీసీబీ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ నందికందిలోని బ్లూ క్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ నుంచి విడుదలవుతున్న వ్యర్థ జలాలను తాగి 50 గొర్రెలు చనిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమ చుట్టుపక్కల నంది కంది, వెల్టూర్, ముబారక్‌పూర్ రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పరిశ్రమపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, పి అశోక్, రాజయ్య, ఆసిఫ్ అలీ, పాల్గొన్నారు .

నేడు అవకాడో సాగుపై అవగాహన సదస్సు

సంగారెడ్డి టౌన్: కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అవకాడో సాగుపై మంగళవారం సంగారెడ్డి ఫల పరిశోధన స్థానంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎఫ్ఆర్ఎస్ సైంటిస్ట్ పి.హరికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ నీరజ ప్రభాకర్ హాజరవుతారని, జిల్లాలోని రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

◆ రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): నందికంది గ్రామంలో రామలింగేశ్వర ఆలయంలో భక్తులు సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

◆ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థికి చిట్కుల్ సర్పంచ్ నీలం మధు సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీకి చెందిన విద్యార్థి మధు ఇటీవలరోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.

◆ టీబీ లేని గ్రామంగా తీర్చిదిద్దాలి

సంగారెడ్డి టౌన్ : టీబీ లేని గ్రామంగా తీర్చిదిద్దాలని డాక్టర్ రాజేశ్వరి అన్నారు. సోమవారం బ్రేకింగ్ దాబారియర్స్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఆరూర్‌లో ఎక్స్ రే క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ క్యాంపులో భాగంగా 110 మందికి ఎక్స్‌రే తీయగా 35 మందిని అనుమానితులుగా గుర్తించామన్నారు. వారికి తెమడ పరీక్ష నిమిత్తం స్ఫుటం సేకరించి డీటీసీఓ కార్యాలయానికి పంపించారన్నారు. టీబీ నిర్ధారణ అయిన వారికీ ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు నెలకు రూ.500 ఇస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో నరసింహులు, అరుణ, అనిల్, పంచాయతీ సెక్రెటరీ నవీన్ పాల్గొన్నారు.

◆ ఓపెన్ స్కూల్ షెడ్యూల్ విడుదల

కొండాపూర్(సంగారెడ్డి): ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొంది ఏప్రిల్, మేలో జరిగే పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా విద్యాధికారి నాంపల్లి రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో అడ్మిషన్ పొంది పరీక్షలకు హాజరు కాని వారు, గతంలో ఫెయిల్ అయినవారు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ 8008403635ను సంప్రదించాలని కోరారు.

◆ ఉత్తమ సేవలకు ప్రశంస

సంగారెడ్డి మున్సిపాలిటీ : వత్తి రీత్యా సక్రమంగా తమ బాధ్యతలు నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్ శరత్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ అనిల్‌ను అభినందించారు. అనంతరం ప్రశంసా పత్రం అందజేశారు.

సంగారెడ్డి టౌన్: ఉత్తమ సేవలందించిన అధికారులకు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

◆ ఉద్యోగ విరమణ చేసిన ఏడీఏకు సత్కారం

జహీరాబాద్: పదవీ విరమణ చేసిన నారాయణఖేడ్ ఏడీఏ కరుణాకర్‌రెడ్డిని ఆయా జిల్లాల వ్యవసాయాధికారులు సత్కరించారు. ఆదివారం రాత్రి జహీరాబాద్‌లో కరుణాకర్‌రెడ్డిని సూర్యాపేట వ్యవసాయాధికారి రామారావు నాయక్, వికారాబాద్ ఏడీఏ వినోద్‌కుమార్, ఏఈఓలు ప్రదీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌లు శాలువా కప్పి సత్కరించారు.

◆ నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం కోసం 31న డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు నారాయణఖేడ్ డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల మధ్య 9959223170 డిపో పరిధిలోని ప్రయాణికులు మెరుగైన సేవల కోసం సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

◆ శానిటరీ కిట్ల పంపిణీ

కొండాపూర్(సంగారెడ్డి): మల్కాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం హైదరాబాద్‌లోని రిషి మహిళా కళాశాల నిర్వాహకులు విద్యార్థినులకు శానిటరీ కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యలక్ష్మీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు శానిటరీ కిట్‌లను పంపిణీ చేసినందుకు రిషి కళాశాల యాజామాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అలవేణి పాల్గొన్నారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ఝరాసంగం(జహీరాబాద్): సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, క్రిష్టాపూర్ సర్పంచ్ అమర్‌జిత్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి నర్సింలు లబ్ధిదారులకు సోమవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎజాజ్‌బాబా, సంగమేశ్వర్, నర్సింలు పాల్గొన్నారు.

◆ భక్తిశ్రద్ధలతో బీరప్ప స్వామి కల్యాణం

ఝరాసంగం(జహీరాబాద్): బీరప్ప దేవత యంత్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం బీరప్ప స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి


ముత్తంగిలో అధికారులతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: కాలనీలలో సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ముత్తంగి గ్రామ పరిధిలోని బేడ, బుడగ జంగం కాలనీలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ సంప్రదాయ పద్ధతిలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో కాలనీలో పర్యటించినట్టు చెప్పారు. అంతర్గత మురుగునీటి కాలువలు, విద్యుత్ స్తంభాలు, ఇంటి నెంబర్లు, పట్టాలు అందించాలని ఎమ్మెల్యేకు కాలనీ వాసులు విజ్ఞప్తి చేశారు. మురుగు నీటి కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టాలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీకి జై భీమ్ నగర్ కాలనీగా నామకరణం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉపేందర్, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు సురేష్, పంచాయతీరాజ్ డీఈ సురేష్, బీఆర్ఎస్ నాయకులు మెరాజ్ ఖాన్, సందీప్, యాదయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రామ, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

శివాలయం వార్షికోత్సవంలో ఎమ్మెల్యే:

గోకుల్ నగర్‌లోని శివాలయం ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

డివిజన్ పరిధిలో చేపడుతున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ నుంచి నందన్ రతన్ ఫ్రైడ్ కాలనీ మీదుగా సింఫనీ కాలనీ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

నారాయణఖేడ్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు పనిభారం పెరిగి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిరంజీవి, టీచర్లు నాగేశ్వరి, వీనకుమారి, శోభ, నాగమణి, సుశీల, స్వరూప, లక్ష్మి, భాగ్య, మంజుల, శశికళ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

వట్‌పల్లి(అందోల్): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. సోమవారం బిజిలీపూర్ గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మారావు, సదానందం పాల్గొన్నారు.

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద ఉపసర్పంచ్ కొటాలె అనిల్ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పెద్దశంకరంపేట ఎంపీపీ జంగంశ్రీనివాస్, నాగల్‌గిద్ద మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు పండరియాదవ్, రమేష్ చౌహాన్, నాగ్‌శెట్టి, జైపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

'మన ఊరు–మన బడి' ప్రారంభానికి ఏర్పాట్లు

సంగారెడ్డి టౌన్ : మన ఊరు, మన బడి మోడల్ పాఠశాలలను 1న ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాజార్షిషాతో కలిసి విద్య, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో మన ఊరు, మన బడి కింద పూర్తయిన మోడల్ పాఠశాలల ప్రారంభాలకు సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజార్షిషా, జెడ్పీసీఈఓ ఎల్లయ్య, జిల్లా విద్యాధికారి నాంపల్లి రాజేష్, డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, డీసీఓ ప్రసాద్, డీఐసీజీఎం ప్రశాంత్ కుమార్, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శివస్వామి మహా పడిపూజ


పూజలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ

సంగారెడ్డి టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో విశ్వం గౌడ్ కన్నెస్వామి స్వగృహంలో శివ స్వామి మహా పడిపూజ సోమవారం అంగ రంగ వైభవంగా నిర్వహించారు. మల్లన్న గురుస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, వివిధ రకాల పూలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివార్లకు పడి వెలిగించి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నిర్మల జగ్గారెడ్డి, కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మహాత్మునికి ఘన నివాళులు


జహీరాబాద్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు


పటాన్‌చెరు: నివాళులుఅర్పిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: ఖేడ్‌లో సోమవారం కాంగ్రెస్, ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి గాంధీ చిత్రపటానికి డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, ఈశ్వరప్ప, అశోక్‌రావు, వెంకట్‌రెడ్డి, హన్మాండ్లు, శ్రీనివాస్‌రెడ్డి, తుకారాం, అర్జున్, వీరారెడ్డి, అల్లాబక్ష్ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. గాంధీ చౌక్‌లో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మునిగాల మాణిక్‌ప్రభు, జిల్లా, పట్టణ బాధ్యులు దారం కృష్ణమూర్తి, వీరేశలింగం, కోటగిరి సత్యనారాయణ, బీఎం ప్రభాకర్, బూసకృష్ణ నివాళులు అర్పించారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని జంగంపేట గ్రామంలో గాంధీకి నివాళులర్పించారు. సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశంగౌడ్, ఉపసర్పంచ్ గోవర్దన్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శంకరప్ప, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు.

జోగిపేట(అందోల్): కాంగ్రెస్ కార్యాలయంలో నివాళులు అర్పించారు. కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఎ.చిట్టిబాబు, డి.శివశంకర్, హరికృష్ణాగౌడ్, మాజీ వార్డు కౌన్సిలర్ శరత్‌బాబు, ప్రవీణ్ కుమార్, ఉల్వాల సతీష్, కొశికె రాజశేఖర్, చిట్యాల మధు, తుడుం యాదయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ డీబీ నాగభూషణం, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సార శ్రీధర్, పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): యువత అడుగుజాడల్లో నడవాలని టీజీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దొడ్ల వెంకట్ పేర్కొన్నారు. మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ మాలిపటేల్ ప్రభు, ప్రిన్సిపాల్ అరవిందశ్రీలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని గాంధీ విగ్రహానికి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్, మహేందర్ రెడ్డి, మల్లేష్, నరసింహ, పాల్గొన్నారు.

జహీరాబాద్: మహాత్మాగాంధీకి ఎమ్మెల్యే కె.మాణిక్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి,జి.గుండప్ప, జహంగీర్, మోతిరాం, గోరేమియా సికందర్, డాక్టర్ చంద్రశేఖర్, బాబీ, పురుషోత్తంరెడ్డి, సత్యం, వెంకటేశం, మంజుల, రమాదేవి పాల్గొన్నారు.